
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 28 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,70,610లు, బంగారం 35.85 గ్రాములు, వెండి 51.2 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



క్రమశిక్షణతో ఆధ్యాత్మికతకు బాట

- 8లో.



త్వరితగతిన పూర్తి చేయండి

- 8లో.

న్యూస్‌రీల్

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కన్ను దాస్



కన్ను దాస్ గెలుపు ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి సుభాష్ జైన్

కొరాపుట్: చాంబర్ ఆఫ్ కామర్స్ నవరంగ్‌పూర్ పట్టణ అధ్యక్షుడిగా మానస్‌కుమార్ దాస్(కన్ను దాస్) ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని చాంబర్ కల్యాణ మండపంలో జరిగిన పోలింగ్ 237మంది వ్యాపారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో కన్ను దాస్‌కు అనుకూలంగా 202 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి పింకు పండాకు 27 ఓట్లు వచ్చాయి. మరో 8 ఓట్లు చెల్లకుండా పోయాయని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సుభాష్ జైన్ ప్రకటించారు. అనంతరం వ్యాపారులు నూతన అధ్యక్షుడిని బందారు ఘరణి మందిరం వరకు ఊరేగించారు.

చేపల చెరువులో మొసలి లభ్యం



అటవీశాఖ అధికారుల అదుపులో మొసలి

కొరాపుట్: చేపల చెరువులో మొసలి పట్టుబడిన ఘటన నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితిలో గురువారం చోటు చేసుకుంది. ముర్తుమ పంచాయతీ సుకిగాం గ్రామంలో ఉమేష్ మాఝి అనే రైతు చేరువులో చేపలు పెంచుతున్నాడు. అందులో మొసలి తిరుగాడుతున్న విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో కొందరు గ్రామస్తులు ధైర్యం చేసి, వల వేసి ఉభయచరాన్ని బంధించారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులకు అప్పగించారు. 4 అడుగుల 9 అంగులాలు పొడవు ఉన్న ఈ మొసలి 12కిలోల బరువు ఉందని సిబ్బంది తెలిపారు. సమీపంలోని బస్కల్ డ్యామ్‌లో తరచూ మొసళ్లు కనిపిస్తున్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీటితో చెరువులోకి చేరి ఉంటుందని భావిస్తున్నారు. దీనికి ఉమ్మర్‌కోట్ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సురక్షిత ప్రాంతంలో విడిచి పెడతామని రేంజర్ అనూప్‌సింగ్ పూజరి ప్రకటించారు. ప్రస్తుతం మొసలి ఆరోగ్యంగా ఉందని తెలిపారు.

కొత్త రైల్వే లైన్లు నిర్మించండి

- రైల్వేమంత్రికి నవరంగ్‌పూర్ ఎంపీ వినతి



రైల్వేమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ రమేష్ మాఝి

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లాలో కొత్త రైల్వేలైన్లు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్‌కి నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మాఝి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో రైల్వేమంత్రిని గురువారం కలుసుకొని, వినతి పత్రం అందజేశారు. కలహండి జిల్లా జునాఘడ్ నుంచి ధర్మగడ్, దేవ్‌భోగ్(ఛత్తీస్‌గఢ్), నవరంగ్‌పూర్ జిల్లా చందాహండి, జొరిగాం, ఉమ్మర్‌కోట్, డాబుగాం, పపడాహండి మీదుగా నవరంగ్‌పూర్ వరకు ఒక రైల్వేలైన్ నిర్మించాలని విన్నవించారు. నూతన రైల్వేలైన్ నిర్మాణానికి భూ సేకరణ జరుగుతున్నందున నూతన ప్రతిపాదనను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. జునాఘడ్-నవరంగ్‌పూర్ మధ్య ఈ లైన్ ఏర్పాటుతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీ అభిప్రాయం వ్యక్తంచేశారు.

కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో సంఘం ప్రతినిధులు

పర్లాకిమిడి: శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యాలయాన్ని పట్టణంలోని నగరంపల్లి వీధిలో నిర్మించారు. దీనిని సంఘం అధ్యక్షుడు ఎ.కులవర్ధనరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డి.లోకు, కోశాధికారి బాబూరావు, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సేవలపై సీఏఓ సీరియస్..

- పూరీ శ్రీమందిరంలో తరచూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న సేవాయత్‌లు
- ప్రతి స్పందనకు బొనొకొ లగ్గికి దూరంగా ఉన్న సిబ్బంది
- నేడు సేవా సబ్ కమిటీ సమావేశానికి పిలుపు



పూరీ శ్రీమందిరం (ఇన్‌సెట్లో) మసకబారిన శ్రీముఖం



భువనేశ్వర్: శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాట్‌ల బొనొకొ లగ్గి(శ్రీ ముఖ అలంకరణ) సేవ నిర్వహణ పట్ల ప్రతిష్టంభన తొలగడం లేదు. అనుబంధ సేవాయత్‌ల మొండి వైఖరితో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో నిత్య నూతనంగా వెలుగొందే జగన్నాథుని ముఖం మసకబారి పోతోంది. నిబంధనలు, ఉత్తర్వుల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీమందిరం ప్రధాన పాలనాధికారి(సీఏఓ) హెచ్చరించడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. ఆయన హెచ్చరికను గాలికి వదిలేసి దత్త మహాపాత్రొ సేవకులు బుధవారం నిర్వహించాల్సిన బొనొకొ లగ్గిసేవకు దూరం పాటించారు. అర్ధరాత్రి వరకు దత్త మహాపాత్రొ సేవాయత్‌ల రాకకోసం ఆలయ వర్గాలు నిరీక్షించినా ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రతిష్టంభన తొలగించేందుకు శుక్రవారం ప్రత్యేకంగా సేవా సబ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు సీఏఓ రంజన్‌కుమార్ దాస్ గురువారం తెలిపారు. ఈ సమావేశం తీర్మానం మేరకు బొనొకొలగ్గి సేవ ప్రతిష్టంభన తొలగించేందుకు సత్వర చర్యలు చేపడతామని ఆయన ప్రకటించారు.

వ్యక్తిగతం కాదు..

బొనొకొ లగ్గి సేవ నిర్వహణ పురస్కరించుకుని సేవాయత్, అధికార, పాలన వర్గాల మధ్య నివురుగప్పిన నిప్పులా గత కొద్ది రోజులుగా వివాదం కొనసాగుతోంది. మాటామంతీ, సంప్రదింపులు, బుజ్జగింపులతో కాలక్షేపం జరుగుతోంది. ఈ చర్యలు ఫలప్రదం కాకపోవడంతో ఆలయ అధికార వర్గం ఆదేశాల ఉల్లంఘనకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని సీఏఓ గట్టిగా హెచ్చరించారు. బొనొకొ లగ్గి సేవ వ్యక్తిగతం కాదని, ఇది పూర్తిగా స్వామి సేవని స్పష్టంచేశారు. సేవాభావంతో ప్రతిఒక్కరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని హితవు పలికారు. రత్న వేదికపై మూల విరాట్‌లకు బొనొకొ లగ్గి సేవ గురువారం మాత్రమే నిర్వహించడం సంప్రదాయమని సేవాయత్ వర్గం వాదిస్తోంది. అలా కాకుండా బుధవారం నిర్వహించడం ఆచార ఉల్లంఘనగా ఆరోపిస్తున్నారు. సంప్రదాయాన్ని అనుసరించి గురువారం మాత్రమే ఈ సేవ చేపడతామని తెగేసి చెప్పారు.

కాలమాన పరిస్థితులకు అనుగుణంగా..

బొనొకొలగ్గి సేవ సుదీర్ఘంగా సాగే గోప్య సేవ. ఈ నేపథ్యంలో సాధారణ భక్తులు, యాత్రికులకు సర్వదర్శనం గంటల తరబడి నిలిపి వేయాల్సి వస్తుంది. గురువారం స్వామికి ఇతర సేవలతో ప్రత్యేక పూజాదులు నిరవధికంగా కొనసాగించడం అనివార్యం. ఈ సంక్లిష్ట పరిస్థితి నివారణకు 2018లో గురువారానికి బదులుగా ఒకరోజు ముందు బుధవారం సేవ నిర్వహించేందుకు వెసులుబాటు కల్పించేందుకు సంస్కరించినట్లు సీఏఓ గుర్తు చేశారు. బుధవారం ఈ సేవ నిర్వహణకు ఊహాతీతమైన అడ్డంకి ఎదురైతే మర్నాడు గురువారం నిర్వహించేందుకు అప్పట్లో తీర్మానించినట్లు తెలిపారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఏకగ్రీవంగా ఈ తీర్మానం చేశారన్నారు. ఈ మేరకు సేవాయత్‌లకు అభ్యర్థించినా.. నిరాకరించడం ఎంతమాత్రం తగదని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరగనున్న సేవా సబ్ కమిటీ సమావేశం తీర్మానం పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

నోటీసులు జారీ..

బుధవారం షెడ్యూల్ ప్రకారం మూల విరాట్‌లకు బొనొకొ లగ్గి సేవ నిరాకరించడం పట్ల శ్రీమందిరం ఆలయ అధికార వర్గం నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సంతృప్తికర వివరణ దాఖలు కాకుంటే తగిన చర్యలు చేపడతామని తెలిపారు. బొనొకొ లగ్గి సేవ నిర్వహణకు అవసరమైన సరంజామా అధికార యంత్రాంగం ముందస్తుగా ఏర్పాటు చేశామన్నారు. శ్రీముఖ సేవలో కస్తూరి, హరితల్, కర్పూరం, కేశర్, శంఖం మసి, ధవళ శంఖం పొడి వినియోగించేందుకు సిద్ధం చేశామని వివరించారు.

నేటి నుంచి మావోయిస్టు వారోత్సవాలు

- బంద్‌కు పిలుపునిస్తూ నియమగిరిలో వెలసిన పోస్టర్లు, బ్యానర్లు



డీకేడీఏ కార్యాలయం మెయిన్ గేటుకు ఉన్న మావోయిస్టు బ్యానర్



ఏఎస్పీ విష్ణుచరణ్ పాత్రొ

రాయగడ: ఈనెల 28నుంచి ఆగస్టు 3వరకు జరగనున్న మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల్లో ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిస్తూ జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో పోస్టర్లు, బ్యానర్లు దర్శనమిచ్చాయి. సీపీఐ(ఎం) బఘునా డివిజనల్ కమిటీ పేరిట వెలసిన ఈ పోస్టర్లు డొంగ్రియాలు నివసించే పర్యాలి గ్రామాల్లో కలకలం సృష్టించాయి. మార్గంలోని చెట్లు, బహిరంగ ప్రాంతాల్లో వీటిని ప్రదర్శించారు. వీటిలో చాటికొన కూడలిలో ఉన్న డొంగ్రియా కొందొ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(డీఏడీఏ) కార్యాలయం మెయిన్ గేటుకు బ్యానర్ వేలాడదీశారు. ఇందులో... ప్రతి గ్రామంలో సహీద్ దినోత్సవాలు నిర్వహించి మద్దతును తెలపాలని కోరారు. ఇదిలా ఉండగా గత కొద్ది నెలలుగా నియమగిరి పర్వత ప్రాంతాల్లో తరచూ మావోయిస్టు బ్యానర్లు ప్రత్యక్షం అవుతుండటంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మునిగుడకు సమీపంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ సంస్థకు చెందిన వాహనాలను ఇటీవల దగ్ధం చేయడం తదితర కార్యకలాపాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో గిరిజనులు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

కూబింగ్ ముమ్మరం..

మావోయిస్టు వారోత్సవాల పిలుపు నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా అదనపు ఎస్పీ విష్ణు చరణ్ పాత్రొ కోరారు. దీనిపై పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలను చేపడుతుందన్నారు. తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడిన ఆయన.. ఇప్పటికే నియమగిరి పర్వత ప్రాంతాలతో పాటు సరిహద్దు జిల్లాలైన కందమాల్, గజపతి, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో కూబింగ్ ముమ్మరం చేశామని తెలిపారు. అణువణువునా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్, శిబిరాలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. పరిస్థితులను సమీక్షించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవులు మృతి



మృతిచెందిన జీవాలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీ లేకాపాయి గ్రామంలో విద్యుత్ షాక్‌తో 2ఆవులు మృతిచెందిన ఘటన గురువారం తెల్లవారుజామున నోటు చేసుకుంది. గోశాలపై నుంచి వెళ్లే 11కేవీ విద్యుత్ తీగ తెగి, సరాసరి జీవాలపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా గోవులు మృతి చెందాయని, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితుడు వేణుహంస గొడొ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కల్యాణ సింగుపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మెట్రిక్ పరీక్షల తేదీలు వెల్లడి



భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్‌ఈ) ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సర మెట్రిక్యులేషన్ వార్షిక పరీక్షల నిర్వహణ ఇతరేతర అనుబంధ కార్యక్రమాల తేదీలను ప్రకటించారు. ఈ మేరకు గురువారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. హైస్కూల్ సర్టిఫికెట్ వార్షిక పరీక్షలు, మాధ్యమ, స్టేట్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ పరీక్షలు 2024 ఫిబ్రవరి 20నుంచి మార్చి 4వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పూర్తి వివరాలను ఈ ఏడాది అక్టోబర్‌లో వెల్లడించనున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం మార్చి 12 నుంచి ప్రారంభించనున్నారు. ఈ ప్రక్రియ సుమారు 12రోజులు నిరవధికంగా కొనసాగుతుంది. పదో తరగతి(మెట్రిక్యులేషన్), మాధ్యమ అర్ధ వార్షిక పరీక్షలు ఈ ఏడాది సెప్టెంబర్ 13నుంచి 16వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించి రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్‌ఈ) ప్రశ్నపత్రాలు రూపొందించనుండగా, అదే నెల 6నాటికి జిల్లా విద్యా అధికారులకు(డీఈఓ) లకు పంపిణీ చేస్తారు. సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో అర్ధ వార్షిక పరీక్షలు నిర్వహించి, సంబంధిత పాఠశాలల్లో మూల్యాంకనం చేపడతారని బోర్డు జారీ చేసిన తాజా నోటిఫికేషన్‌లో వివరించింది.

లబ్ధిదారుల జాబితా విడుదల



బీడీఓ కార్యాలయంలో ప్రదర్శిస్తున్న లబ్ధిదారుల జాబితా

జయపురం: స్థానిక సమితిలోని ప్రధానమంత్రి ఆవాజ్ యోజన లబ్ధిదారులు రెండో జాబితాను అధికారులు గురువారం విడుదల చేశారు. 22 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దీనికి సంబంధించిన జాబితాను ప్రదర్శించారు. ఇందులో 497మంది లబ్ధిదారులు ఉండగా, సమితిలోని 5పంచాయతీలకు స్థానం దక్కక పోవడం గమనార్హం. ఒక్క ఇల్లు కూడా మంజూరుకాని పంచాయతీలు అంబాగుడ, బలియ, కలియగాం, పూజారిపుట్, రాణిగుడ. లబ్ధిదారులపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఆగస్టు 2లోగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించాలని బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి రాజీవ్‌దాస్ వెల్లడించారు. అభ్యంతరాలను పంచాయతీ, సమితి కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చని సూచించారు. అభియోగాలను పరిశీలించిన అనంతరం యోగ్యులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు స్పష్టంచేశారు. ప్రాథమిక జాబితాలో అంత పంచాయతీలో 23, బొడొజివునిలో 21, బరిణిపుట్‌లో 25, ధనపూర్‌లో 29, డొంగరచించిలో, ఎకంబాలో 21, గొడొపొదర్‌లో 39, హడియాలో 2, జామండలో 25, జయంతిగిరిలో 28, కేవడిలో 31, కొంగలో 57, కుములిపుట్‌లో 9, పంపుణిలో 23, రొండాపల్లిలో 35, టంకువలో 82, ఉమ్మిరి పంచాయతీలో 27మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు.

తెంతులిగుమ్మలో చైతన్య ర్యాలీ ప్రారంభం



జ్యోతి వెలిగించి, ర్యాలీని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ నాయక్ మనుమడు మధు నాయక్

జయపురం: ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు సహీద్ లక్ష్మణ నాయక్ జన్మస్థలం సబ్ డివిజన్ పరిధి తెంతులిగుమ్మ గ్రామంలో మటి లగ్న సాహిత్య సంసద్ సంస్థ ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ నాయక్ మనుమడు మధు నాయక్ జ్యోతి ప్రజ్వలనతో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మటి లగ్న సంసద్ అధ్యక్షుడు కిశోర్‌చంద్ర ప్రధాన్ ముందుగా లక్ష్మణ నాయక్ విగ్రహానికి పూలమాలలు, నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహిస్తూ వందేమాతరం, భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ఆంగ్లేయుల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన నిర్వహించిన భూమికను వివరించారు. సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ మట్టి లగ్న సాహిత్య సంసద్ మూడో వార్షికోత్సవం సందర్భంగా అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో వారం రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ ప్రాంత భాష, సంస్కృతి, చారిత్రక ఘటనలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సలహాదారు సింహాచల పండా, కార్యదర్శి, సహీద్ లక్ష్మణ నాయక్ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సూర్యనారాయణ సాబత్, ప్రాంతీయ సాధన కేంద్ర కో-ఆర్డినేటర్ భక్త మెహరా, ఉపాధ్యాయులు అనీల్‌కుమార్ పూజారి, అలోక్ జెనా, సన్యాసి భూమియ, నర్సింహ గొడ పాల్గొన్నారు.

డీఆర్‌ఎంకు స్వాగత సత్కారం



సభలో ప్రసంగిస్తున్న శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ సాహు, వేదికపై డీఆర్‌ఎం బజ్వా

భువనేశ్వర్: ఖుర్దారోడ్ డివిజన్ రైల్వే అధికారి(డీఆర్‌ఎం)గా హర్భజన్ సింగ్ బజ్వా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో స్వాగత సభ గురువారం ఏర్పాటు చేశారు. ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ బీజేబీ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ర సాహు పాల్గొని, మాట్లాడారు. డివిజన్ పరిధిలో సిబ్బంది బాగోగుల పర్యవేక్షణలో మండల అధికారి డీఆర్‌ఎం కీలక పాత్రధారిగా పేర్కొన్నారు. లాభాల పట్టాలపై రైళ్లు పరుగులు తీయించేందుకు సిబ్బంది సంక్షేమం అత్యంత కీలకమని తెలిపారు. సిబ్బంది, అధికార యంత్రాంగానికి శ్రామిక్ కాంగ్రెస్ వారధిగా వ్యవహరించి, డివిజన్ సమగ్ర అభివృద్ధికి డీఆర్‌ఎంకు సకల సహాయ సహకారాలు అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన డీఆర్‌ఎం బజ్వాను గజమాలతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కల్యాణ్ పట్నాయక్, సీనియర్ మండల విద్యుత్ ఇంజినీర్(సాధారణ) సంజయకుమార్ రౌత్, సీనియర్ మండల కార్మికశాఖ అధికారి ఆర్‌ఎన్‌ఏ పరిడా, సీనియర్ మండల విద్యుత్ ఇంజినీర్(ఓపీ) అమియ రంజన మహంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన



సదస్సులో ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు

పర్లాకిమిడి: నూతన విద్యావిధానం–2020 మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలోని బెత్తగుడ కేంద్రీయ విద్యాలయంలో అవగాహన సదస్సు గురువారాం నిర్వహించారు. ఇందులో జవహార్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రథ్, జిల్లా ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ ముర్ము, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ ఎ.రవిబాబు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ పండా హాజరై, మాట్లాడారు. నూతన విద్యా విధానంలో విద్యార్థులకు ఆవిష్కరణలు, రూపాంతరం, డిజిటల్ విధానంలో బోధన అందించనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో స్మార్ట్ తరగతి గదులు, టాయిలెట్లు, ఈ–లైబ్రరీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2047నాటికి దేశవ్యాప్తంగా శతశాతం అక్షరాశ్యత సాధించే దిశగా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధానాన్ని రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో నవోదయ, ఎంఆర్ బాలుర ఉన్నత పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, ఒడిశా ఆదర్శ విద్యాలయం హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రసవ వేదన



జోరు వర్షంలో గర్భిణిని డోలీలో మోసుకు వెళ్తున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక ఇప్పటికే ఎంతోమంది అవస్థలు పడుతున్నారు. ఖొయిర్‌పుట్ సమితి పర్కన్‌మాల పంచాయతీలో గురువారం ఇదే తరహా ఘటన ఎదురైంది. డొంగాకూద గ్రామానికి చెందిన జాని పంగికి పురిటినొప్పులు రావడంతో గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త ఖొయిర్‌పుట్ ఆరోగ్య కేంద్ర అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే గత కొద్ది రోజులుగా పడుతున్న భారీ వర్షాలకు తోడు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చేరుకోలేమని అంబులెన్స్ సిబ్బంది స్పష్టంచేశారు. దీంతో గర్భిణి భర్త, గ్రామస్తులు డోలీలో ఆమెను కూర్చోబెట్టి, కాలినడకన 6కిలోమీటర్ల దూరంలో నిలిపి ఉంచిన అంబులెన్స్ వద్దకు చేర్చారు. కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రంలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. అయితే అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

క్లుప్తంగా

అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

● నగదు, నకిలీ ఆధారాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న పరికరాలతో అంతరాష్ట్ర ముఠా

బరంపురం: నగరంతో పాటు గంజాం జిల్లాలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న దారి దోపిడీలకు సంబంధించి అంతరాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బరంపురం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సరవణ్ వివేక్ వెల్లడించారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న వరుస దోపిడీ ఘటనల్లో నమోదైన కేసులపై ప్రత్యేక బృందాన్ని నియమించి, దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అంతర్రాష్ట్ర ముఠాను బరంపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2బైక్‌లు, నకిలీ నంబర్ ప్లేట్‌లు, 6 సెల్‌ఫోన్లు, ఆధార్‌కార్డులు, రూ.18 వేల నగదు, ఇతర సామగ్రి సీజ్ చేశారు. నిందితులు గుజరాత్ రాష్ట్రంలోని కొటమరి జిల్లా నాయతల గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ నోట, రాజ యాదవ్, మనీస్‌కుమార్ యాదవ్‌గా గుర్తించారు. వీరిని జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచి, బరంపురం సర్కిల్ జైలుకు తరలించినట్లు ఎస్పీ వివరించారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం




కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న, శాస్త్రవేత్త దివంగత అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు అన్నా రు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని మహాత్మాజ్యోతిరావు పూలే పార్కులో ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నక్క గణపతిరావు, దేశళ్ల గోవిందు, మల్లిబాబు, కర్రి రంగాజీదేవ్, ఉపాధ్యక్షులు గుత్తు చిన్నారావు, పసగాడ రామకృష్ణ, కాయితీ వెంకటరమణ, పాలిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నా రు. స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ భవనంలోనూ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సభ్యులు చిన్మయరా వు, గుణాకరరావు, నరసింగరావు, కె.సత్యనారాయ ణ, బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ రైల్వేగేటు మూసివేత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ ఎల్‌సీ రైల్వేగేటును మరమ్మతుల నేపథ్యంలో రాత్రి సమయంలో మూసివేస్తున్నట్లు పలాస రైల్వేస్టేషన్ సీనియర్ ఇంజినీర్ బి.వి.ఎస్.గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1 వరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మూసివేత వర్తిస్తుందని, ప్రయాణికులు గుర్తించాలని కోరారు.

భారీ కింగ్‌కోబ్రా హతం



20 అడుగుల కింగ్ కోబ్రా

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ జెన్నాగాయి గ్రామ పంట పొలాల్లో 20 అడుగుల కింగ్ కోబ్రా పాము గురువారం హల్‌చల్ చేసింది. భయాందోళనకు గురైన స్థానికులు కర్రలతో పామును స్థానికులు హతమార్చారు.

హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు విశాఖపట్నం రేంజ్ హోంగార్డు కమాండెంట్ యు.రామ్‌మోహన్ రావు అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం హోంగార్డులకు దర్బార్ కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. హోం గార్డులు నేర పరిశోధన, ట్రాఫిక్, నేర నియంత్రణ దర్యాప్తులో పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలు ప్రతి ఒక్కరికీ ఉంటాయని, అనుకూల దృక్పథంతో ముందుకు సాగితే ప్రతి సమస్య కు పరిష్కారం ఉంటుందని అన్నారు. ప్రభు త్వం హోంగార్డు సేవలు గుర్తిస్తుందని, పనికి, సేవలకు దగ్గ వేతనం, సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఆర్‌ఐ ఎస్.మహమ్మద్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఆధ్యాత్మికతకు బాట

● రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
● డివైన్ లైట్‌హౌస్ ఏర్పాటుకు శంకుస్థాపన



పతాకం ఊపి, వార్షిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న రాష్ట్రపతి

భువనేశ్వర్: క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ఆధ్యాత్మికతకు బాటలు వేస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఈ దిశలో ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిరంతర కృషి అభినందనీయమన్నారు. నగరంలోని టొమాండో దసబాటియా ప్రాంతం ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డివైన్ లైట్‌హౌస్ నిర్మాణానికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాదిని సానుకూల మార్పుల సంవత్సరంగా ప్రకటించారు. ఈ నినాదంతో ఏడాది పొడవునా సెమినార్లు, సమావేశాల నిర్వహణ కోసం 'ది ఇయర్ ఆఫ్ పాజిటివ్ చేంజ్' అనే వార్షిక నినాదాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక, ఆధ్యాత్మిక ప్రచారం కోసం మహిళలు స్వతంత్రంగా నిర్వహిస్తున్న సంస్థగా ఓంశాంతి ప్రత్యేక ఉనికిని బలపరచుకోవడం విశేషమన్నారు. ఇది ఒక సంస్థ మాత్రమే కాదని, మానవాళి సమగ్ర కల్యాణానికి దోహదపడే వ్యవస్థగా పేర్కొన్నారు. మానవాళికి భౌతిక, ఆధ్యాత్మిక అభివృద్ధి రెండూ అవసరమని తెలిపారు. సాంకేతికత మార్పుకు ఇది చోదకం వంటిదని, మార్పు అనివార్యమని.. అభివృద్ధికి అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. భౌతిక మార్పులు ఆనందాన్ని ఇవ్వగలవని, ఆధ్యాత్మిక మార్గంలో అనుసరించడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని సూచించారు. ఎప్పటికప్పుడు కొన్ని ప్రతికూల ఆలోచనలు మనసులను కలవర పెడుతుంటాయని, ఆత్మ పరిశీలన లేకపోవడంతో అటువంటి వాటికి లోనవుతుంటామన్నారు. దీని వల్ల మనిషిలో అసూయ, ద్వేషం అనే భావాలు పెరుగుతాయని హెచ్చరించారు. ప్రతికూల ఆలోచనలను వదిలించుకుని, సానుకూలత వైపు వెళ్లడమే మన ముందున్న అతిపెద్ద సవాల్ అనివ గుర్తు చేశారు. మానవాళికి అవగాహన కల్పించి ప్రజలను సానుకూల దిశలో ముందుకు తీసుకెళ్లేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న కృషి నిరవధికంగా కొనసాగాలని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ పాలుపంచుకున్నారు.



వేదికపై అభివాదం చేస్తున్న రాష్ట్రపతి, గవర్నర్ గణేషీలాల్



ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బిసంకటక్‌లో ఫొటో బైండింగ్ యూనిట్



తాము రూపొందించిన ఫొటో ఫ్రేమ్‌లతో మహిళలు

● స్వయం ఉపాధి దిశగా మహిళల అడుగులు



బైండిగ్ పనుల్లో స్వయం సహాయక బృందాలు

రాయగడ: మిషన్‌శక్తి ఆర్థిక సహకారంతో జిల్లాలోని బిసంకటక్‌లో ఫొటో బైండిగ్ యూనిట్ ప్రారంభమైంది. స్వయం సహాయక బృందాలకు చెందిన 30మంది మహిళలు ఈ యూనిట్‌ని నడిపిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి అమలు చేసిన మిషన్‌శక్తి వారి సాధికారతకు ఎంతగానో దోహదపడుతోంది. సుమారు రూ.2.50 లక్షల రుణాన్ని ఈ బృందానికి మంజూరు చేయడంతో వినూత్నంగా ఫొటో బైండిగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అంతకుముందు 2నెలలు వీటి తయారీపై సమగ్ర శిక్షణ పొందారు. అనంతరం మిషన్‌శక్తి ద్వారా లభించిన ఆర్థిక సహకారంతో యూనిట్‌కు సంబంధించిన పరికరాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ యూనిట్‌లో బైండింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దేశ నాయకులు, సంస్కృతికి అద్దం పట్టే కళా రూపాలను మహిళలు స్వయంగా తయారు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వీటిని మార్కెట్‌లో విక్రయించేందుకు అనుగుణంగా తగు ప్రణాళికలు రూపొందించుకుని, యూనిట్‌ను మరింత విస్తరిస్తామని సభ్యులు ఆశారాణి మథ, రునుపాత్రొ, సుజాత పండా తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు

జయపురం: బొరిగుమ్మ సమితిలోని హొర్డిలి 5టీ, ఎస్టీ, ఎస్సీ ఉన్నత పాఠశాలలో గత 4రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా బొరిగుమ్మ విద్యాశాఖ అధికారి సచిన్ మల్లిక్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య ఏ విధంగా బోధించాలో ఉపాధ్యాయులకు వివరించినట్లు తెలిపారు. చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, అప్పుడే వృత్తికి న్యాయం చేసిన వారవుతామని సూచించారు. శిబిరంలో 11ఉన్నత పాఠశాలలకు చెందిన 100మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 50మంది ఉపాధ్యాయులను ఒక యూనిట్‌గా విభజించి, శిక్షణ అందించారు. మధుస్మిత సేన్, సీఆర్‌సీసీ మనోజ్ బిశాయి, బైకృష్ణనాథ్ బెహరా, సత్యనారాయణ దాస్, లవ పెంటియ, గౌరంగ చరణ్ పెంటియ, ఉమాశంకర ఆచార్య, జయకృష్ణ త్రిపాఠి శిక్షణ అందించారు. విద్యాశాఖ అదనపు అధికారి సుభాష్‌చంద్ర మాఝి, వీఆర్‌సీ జగదీష్ మెహరా, సీఆర్‌సీసీ మృత్యుంజయ పండా పర్యవేక్షించారు. ముగింపు కార్యక్రమంలో కొరాపుట్ బీఈఓ శ్రీకాంతి జానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

30న రాష్ట్రస్థాయి రైతు కార్మికుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర ప్రకాశరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక విధానాలకు నిరసనగా ఈ నెల 30న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి రైతు కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని ఎస్‌కేఎం నాయకులు కోరారు. శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జీడి రైతులకు రూ.16 వేలు గిట్టుబాటు ధరను తక్షణమే ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మణిపూర్ మారణ హోమంలో మరణించిన వారికి నివాళులర్పించారు. సమావేశంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు కె.మోహన్ రావు, బి.శ్రీరామమూర్తి, జి.సురేష్ కుమార్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎన్.నీలంరాజు, గంగరావు సింహాచలం, పి.చంద్రరావు, పోలాకి ప్రసాదరావు, చిక్కాల గోవిందరావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రిపోర్టులను ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న కామేశ్వరప్రసాద్ తదితరులు

అరసవల్లి: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ పరీక్షల నెలవారీ నివేదికలను సోచ్ అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి నెలా అప్‌లోడ్ చేయాలని నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ కామేశ్వర ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అధ్యక్షతన గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీకి సంబంధించి కేవలం స్క్రీనింగ్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారని, పాజిటివ్ వచ్చిన వారికి సమీపంలోని ఐసీటీసీ కేంద్రానికి తరలించే బాధ్యత కూడా ఆయా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఐవీ నియంత్రణ మండలి ప్రతినిధి రాజేంద్రప్రసాద్, డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు తదితరు లు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కేంద్రం



కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద నాయకులు, రైతులు, పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 159 కేంద్రాలు ప్రారంభిస్తూ పీఎం కిసాన్ కింద రూ.2వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమచేశారు. వ్యవసాయశాఖ, ఐపీఎల్ ఆధ్వర్యంలో ఐపీఎల్ రాష్ట్ర చీఫ్ మేనేజర్ వి. లోగమూర్తి, సేల్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఆత్మ పి.డి. కృష్ణారావు, బుడుమూరు తిరుమలరావు, విశ్రాంత డీఈ బగాది వేణుగోపాల్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పొన్నాడలో కాలువ పనులు పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. గురువారం ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీలో కాలువ పనులు, 2023-24 ప్లాంటేషన్ పనులను పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శోభాదేవీ, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

● మో ఘురొ పనులపై కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న బీడీఓలు, అధికారులు

రాయగడ: పేద ప్రజలకు ఇళ్లను సమకూర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేసిన మో ఘురొ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు మంజూరు చేసే రుణాలు సకాలంలో అందిస్తే ఇళ్లను నిర్మించుకునే అవకాశం కలుగుతుందన్నారు. దీనిపై జిల్లాలోని 11 సమితుల్లో ఉన్న బీడీఓలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి పరిధిలో ఇప్పటి వరకు ఎంతమంది లబ్ధిదారులకు ఇళ్ల కోసం రుణాలు మంజూరయ్యాయనే వివరాలపై ఆరా తీశారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,715 మంది ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోగా, 128మందికి మాత్రమే రుణాలు అందాయని అధికారులు తెలిపారు. కాసీపూర్ సమితిలో 692మంది దరఖాస్తులు అందించగా, వీరిలో 23, బిసంకటక్ సమితిలో 371లో 19, కొలనారలో 420మంది దరఖాస్తులు చేసుకోగా 19మందికి, రాయగడ సదర్ 461మందిలో 17, కల్యాణ సింగుపూర్ 315లో 11, మునిగుడలో 315మందికి గాను 10, గుడారి 267లో 9, రామనగుడ 216లో 8, పద్మపూర్‌లో 254మందికి గాను 7, గుణుపూర్ 226లో 4, చంద్రపూర్ సమితిలో 178మంది దరఖాస్తులు అందించగా ఒక్కరికి మాత్రమే ఇంతవరకు రుణాలు మంజూరయ్యాయని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. త్వరలో లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ ధర్మానంద బెహరా, బీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా అకడమిక్ క్యాలెండర్ రూపకల్పన



అధికారులతో సమీక్షిస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అధికారులు, విభాగాధిపతులు పక్కాగా అకడమిక్ క్యాలెండర్ సిద్ధం చేసి తరగతులు నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆదేశించారు. విశ్వవిద్యాలయంలో గురువారం అధికారులు, విభాగాధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ వారీగా క్లాస్‌వర్కు జరగాలన్నారు. మిడ్ సెమిస్టర్, సెమిస్టర్ పరీక్షలు సక్రమంగా జరగాలని చెప్పారు. డిగ్రీ కళాశాలల వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 29తో ముగియనుందని తెలిపారు. కళాశాలలపై కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. నిబంధనలు పాటించని 11 డిగ్రీ కళాశాలల్లో ఉన్నత విద్యా మండలి ప్రవేశాలు నిలిపివేసిందన్నారు. పీజీ ప్రవేశాలు మొదలయ్యేలోగా డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల చేయాలని సూచించారు. పీజీ, బీఎడ్, బీపీఈడీ నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ ఎనిమిదో సెమిస్టర్ జవాబు పత్రాలు మూల్యాంకణ త్వరితగతిన ప్రారంభించాలన్నారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ జవాబు పత్రాలు మూల్యాంకణం త్వరితగతిన, పారదర్శకంగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కువ మార్కులు, తక్కువ మార్కులు వచ్చిన జవాబుపత్రాలను మరోసారి పరిశీలించాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, చింతాడ రాజశేఖర్ రావు, సీడీసీ డీన్ పీలా సుజాత, వర్సిటీ ఇంజినీర్ అజిత్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కుమార్‌కు మిస్సైల్‌మేన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అంపిలి ప్రశాంత్‌కుమార్

కొత్తూరు: విజయవాడకు చెందిన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా గురువారం కొత్తూరు మండలం గూనభద్రకు చెందిన విద్యావేత్త, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు అంపిలి ప్రశాంత్‌కుమార్‌కు మిస్సైల్‌మేన్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్‌స్పిరేషనల్ అవార్డు-2023ను ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు చేతుల ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాల అమల్లో శ్రద్ధ చూపించడం, విద్యారంగ పరిరక్షణకు కృషి చేసినందుకు గాను అవార్డు అందించారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



తూలుగు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సిబ్బంది

గార: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తూలుగు సబ్‌స్టేషన్ వద్ద దశలవారీ ఆందోళన ప్రారంభించారు. జేఎల్‌ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెండింగ్ డీఏలు చెల్లించడం, ఏకసభ్య కమిషన్ రద్దు చేయడం, సచివాలయ ఉద్యోగులకు ఎస్‌ఆర్ కల్పించడం వంటి డిమాండ్లతో ధర్నా నిర్వహించారు.

ఆంధ్రా మంత్రిని సన్మానించిన గుసాని సమితి అధ్యక్షుడు

● తీవ్రంగా ఖండించిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



: గుసాని సమితి కేంద్రం వద్ద ఆంధ్రా మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న వీర్రాజు, నాయకులు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు జైమినిరావు

పర్లాకిమిడి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖామంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శ్రీకాకుళం జిల్లా మందస మండల పరిధిలో గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆయా ప్రాంతాలకు గజపతి జిల్లా గుసాని సమితి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ సమయంలో గుసాని వద్ద సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు ఆయనకు సాదరంగా స్వాగతం పలుకుతూ సన్మానించారు. దీనిపై స్థానిక జిల్లావ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎ.జైమినిరావు, కాంగ్రెస్ ఛత్ర అధ్యక్షుడు బసంత పండా, సంగ్రాం సాహు తదితరులు వీర్రాజుపై ధ్వజమెత్తారు. 2021 సెప్టెంబర్‌లో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం రాయఘడ సమితి గంగాబడ పంచాయతీ మాణికపట్న వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం విషయంలో మంత్రి అప్పలరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. అప్పటి ఏడీఎం సంగ్రాంశేఖర పండాపై దురుసుగా ప్రవర్తించారన్నారు. దీనిని ఖండిచాల్సిన సమితి అధ్యక్షుడు.. ఆయనను సన్మానించడంపై విస్మయం వ్యక్తంచేశారు. దీనిపై వీర్రాజు జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును గుసాని సమితి కేంద్రం వద్ద బీజేడీకి చెందిన ఎన్.వీర్రాజు సన్మానించడం పట్ల పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఖండించారు. ఒడిశా భూ భాగంలో ఉన్న గంగాబడ పంచాయతీ మాణిక్‌పట్నలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధిపత్యం చెలాయిస్తుంటే.. ఒడిశా ప్రభుత్వం మిన్నకుండిపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

నిలకడగా తోటపల్లి నీటిప్రవాహం



కుడిప్రధానకాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం నిలకడగా ఉంది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రం 6 గంటలకు 105 మీటర్ల లెవెల్‌కు గాను 103.62 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 1,350 క్యూసెక్కుల నీరు రాగా అధికారులు ఒక గేటు ఎత్తివేసి 926 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.68 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ కిషోర్ తెలిపారు. అలాగే పాత కుడి కాలువద్వారా 90 క్యూసెక్కులు, ఎడమ కాలువద్వారా 200 క్యూసెక్కుల నీటిని, కుడి ప్రధాన కాలువద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు వద్ద నీటిపరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బంగారం వెండి చోరీ

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలో గల జి.షణ్ముఖరావు ఇంటిలో పట్టపగలే దొంగలు చొరబడి బీరువాలో గల సుమారు 8 తులాల బంగారం,35 తులాల వెండి ఆభరణాలు దోచుకుపోయారు. గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో దాసుళ్లపాలెం వెళ్లే రోడ్డులోని ఇంట్లో షణ్ముఖరావు కుటుంబంతో నివసిస్తున్నారు. బుధవారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో భార్యా,పిల్లలతో కలిసి ఆస్పత్రి పని నిమిత్తం విశాఖపట్నం వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకుని చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇల్లంతా చిందరవందరగా ఉంది. బీరువా తలుపులు తెరిచి ఉండడం పరిశీలించి 8 తులాల బంగారు ఆభరణాలు,35 తులాల వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు బాధితుడు షణ్ముఖరావు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ముకుందరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గురువారం ఉదయం విజయనగరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది.

ఆగస్టు 1న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: పట్టణంలో ఆగస్టు 1న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఇంటర్మీడియట్, ఐటీఐ (ఫిట్టర్,వెల్డర్, ఎలక్ట్రికల్, డీజిల్‌మెకానిక్, డిప్లమో (మెకానికల్, ఎలక్ట్రికల్,), బీఎస్సీ కెమిస్ట్రీ, ఏదీ డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. ఆగస్టు 1న ఉదయం 9 గంటల నుంచి సాయిరామ్ డిగ్రీ కళాశాల పార్వతీపురంలో నిర్వహించనున్న మినీజాబ్ మేళాకు సినర్జీ కాస్టింగ్ లిమిటెడ్, నాగార్జున ఫెస్టిసైడ్స్, కెమికల్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్‌స్రూ కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, 1 పాస్‌పోర్ట్ ఫొటోతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947, 6303493720 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: టీవీ చూడవద్దని తండ్రి వారించినందుకు మనస్తాపం చెందిన యువతి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం బొడ్డవలస గ్రామానికి చెందిన కద్రక అఖిలను సినిమా చూసేందుకు ఎవరింటికీ వెళ్లవద్దని తండ్రి నాగేశ్వరరావు తరచూ చెబుతున్నప్పటికీ పెడచెవిన పెట్టి అదే గ్రామంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. దీంతో తండ్రి కోపంగా వచ్చి కర్రతో ఆమెను కొట్టగా, ఆ కర్ర పెద్దమ్మ గౌరమ్మకూ తగిలింది. తన వల్ల పెద్దమ్మకు దెబ్బ తగిలిందని మనస్తాపం చెందిన అఖిల పురుగు మందు తాగేసింది. ఈ విషయం కుటుంబసభ్యులు గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మడ్డువలసకు 1400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ప్రాజెక్టు వద్ద నమోదైన 61.28 మీటర్లు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో గురువారం నాటికి 1400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. వర్షాలు విస్తారంగా కురవడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటిప్రవాహం పెరగడంతో ప్రాజెక్టుకు నీటితాకిడి పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 61.28 మీటర్ల నీటిమట్టం నమోదైంది. కుడి ప్రధాన కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని ఖరీఫ్ సాగుకు విడిచిపెట్టినట్టు డీఈ పి.అర్జున్ తెలిపారు.

చదువు లేని వాడివని దిగులు చెందకు..!

- 'ఓపెన్'గా చదివే అవకాశం
- టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ
- ఇంటి దగ్గర నుంచి చదువుకునే వెసులుబాటు
- సాధారణ కోర్సులతో సమానమైన గుర్తింపు



సార్వత్రిక విద్యాలయం ద్వారా చదువుతున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్/విజయనగరం ఫూల్‌బాగ్: ఉన్నత విద్య కోసం ఆశపడినా అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారు అనేక మంది ఉన్నారు. వివాహమైన తర్వాత, పెద్ద వయస్సు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడే వారూ ఉన్నారు. అటువంటి వారి చింత తీర్చేందుకు సార్వత్రిక విద్యా (ఓపెన్ స్కూల్) విధానం అందుబాటులో ఉంది. నియత పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్ సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్ అర్హతతో లభించే అన్ని ఉద్యోగాలకూ అర్హులవుతారు.

ఇవీ సబ్జెక్టులు

పదో తరగతికి గ్రూపు–ఎలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం /ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బిలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్మీడియట్ గ్రూపు–ఎలో ఇంగ్లీషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు గ్రూపు–బి ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే వారు మాత్రం టెన్త్ పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టు రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి, ఉత్తీర్ణ పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని 10, ఇంటర్మీడియట్ పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే.. రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. టెన్త్ హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలూ రాస్తే సరిపోతుంది. మార్కులు బదలాయించుకునే వారు సబ్జెక్టుకు పదో తరగతికైతే రూ.100. ఇంటర్మీడియట్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులు బుధవారం నుంచి స్వీకరిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 30 అక్రిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉన్నాయి. ప్రవేశాలు పొంద గోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి.

- ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 25వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకూ అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు.

కాంటాక్ట్ తరగతులు

ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 200 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

ఇవీ అర్హతలు

- పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్మీడియట్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణపత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగా అడ్మిషన్ పొందగోరే వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. మధ్యలో చదువు మానేసి, తిరిగి కొనసాగించుకునే వారికి ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా చక్కని అవకాశం లభిస్తోంది. ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందినవారు కాంటాక్టు క్లాసులకు తప్పనిసరిగా హాజరు కావాలి. అర్హతలు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ఏటా పెరుగుతున్నాయి.

బి.లింగేశ్వర రెడ్డి, డీఈఓ, విజయనగరం జిల్లా
ఎస్ ప్రేమ్ కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఆరోతరగతి నుంచే జాతీయ విద్యావిధానం

- ఐదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన
- కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులకు చిన్నతనం నుంచే వృత్తివిద్యలో మెలకువలు నేర్పడం ద్వారా నైపుణ్యంతో కూడిన వ్యక్తులుగా తీర్చిదిద్దడమే జాతీయ విద్యావిధానం లక్ష్యమని కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు అన్నారు. మాతృభాషలోనే ఐదో తరగతి వరకు తప్పనిసరిగా విద్యాబోధన జరిగేలా జాతీయ విద్యావిధానంలో మార్పులు చేసినట్లు చెప్పారు. జాతీయ విద్యావిధానం -2020 అమలులోకి వచ్చిన తర్వాత కేంద్రియ విద్యాలయం ద్వారా విద్యాబోధనలో ఎన్నో మార్పులు చేశామన్నారు. జాతీయ విద్యావిధానం అమలుచేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో సీబీఎస్ఈ విద్యావిధానం అమలు చేస్తున్న పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా తమ పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వివరించారు.

ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం పెరగాలి

కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి మాట్లాడుతూ నూతన విద్యావిధానం అమలులో భాగంగా అధ్యాపకులు, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు మెరుగుపరచడం అత్యంత కీలకమైన అంశమని చెప్పారు. ఈ దిశగా దృష్టి సారించాలని సూచించారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని కాకుండా ఆయా అంశాలపై పరిజ్ఞానం పెంపొందించే విధంగా జాతీయ విద్యావిధానం రూపొందించారని, ఇది వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ సందర్భంగా బాలవాటిక-3 తరగతి గదిని, విద్యార్థులు రూపొందించిన వివిధ బోధన పరికరాల ప్రదర్శన, బాలవాటిక-3 తరగతిని కోరుకొండ సైనిక స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి ప్రారంభించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జాతీయ స్థాయి సంగీత ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ శాస్త్రి ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో ఫోర్ట్‌సిటీ స్కూల్ ప్రిన్సిపాల్ డా.రోజానా ఖాన్, వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్, డీపీఆర్‌ఓ డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకి చెల్లిన కాలం

- సులువుగా విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు
- పార్వతీపురం మన్యం జిల్లా నాలుగు అగ్రి ల్యాబ్‌లు



పార్వతీపురంలో వైఎస్సార్ అగ్రి ల్యాబ్

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆసరాగా నిలుస్తోంది. దీనిలో భాగంగా భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువుల నాణ్యతను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన వైఎస్సార్ అగ్రిల్యాబ్స్ అందుబాటులోకి రావడంతో కల్తీలకు చెక్‌పెడుతోంది. దీంతో విత్తనాలు, ఎరువుల నాణ్యత తెలుసుకోవడం సులువైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో అగ్రిల్యాబ్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. విత్తనాలు, ఎరువుల నాణ్యతపై రైతులకు అనుమానం వస్తే ఈ ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవచ్చు. ముందుగానే పరీక్ష చేయించుకుంటే కల్తీల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. జిల్లాలో ఈ ఏడాది నాలుగు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఇటీవల పార్వతీపురం, పాలకొండలో సేవలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. అన్ని రకాల విత్తనాలు, ఎరువులను తీసుకువెళ్లే వారు విత్తనాల నాణ్యత, మొలకశాతం, శుద్ధి శాతం తెలుసుకోవచ్చు.

'అధునాతన సాంకేతిక యంత్ర పరికరాలతో పరీక్షలు

వరి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర, పచ్చిరొట్టతో పాటు రైతులు సాగుచేసే పలురకాల పంటలకు సంబంధించి అన్ని రకాల విత్తనాలను ఈ ల్యాబ్‌లో పరీక్షించి రిపోర్టులు ఇస్తారు. ఎరువులను పరీక్షించి వాటిలో ఏ రసాయనాలు ఎంతశాతం ఉన్నాయో తెలుసుకోవచ్చు. విత్తనాల పరీక్షలకు సంబంధించి సీడ్ డెర్మినేటర్, ప్యూరిటీ బోర్డు, సీడ్ బోయర్, సీడ్ డివైడర్ వంటి పరికరాల ద్వారా నాణ్యతను పరీక్షిస్తారు. ఎరువులకు సంబంధించి వాటర్ షేకింగ్ బాత్, ఎనలిటికల్ బ్యాలెన్స్, హాట్ ఎయిర్ ఓవెన్‌తో పాటు మరికొన్ని పరికరాలతో పరీక్షించి రిపోర్టు అందిస్తారు. దీని కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లను నియమించారు. ఆర్‌బీకేల ద్వారా రాష్ట్రప్రభుత్వం నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందిస్తుండగా, కొత్తగా ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లతో నకిలీ విత్తనాలు, పురుగు మందుల బెడద లేకుండా జాగ్రత్త పడవచ్చని కొంతమంది రైతులు చెప్పారు.

నకిలీల బెడదను అరికట్టవచ్చు



జిల్లా పరిధిలోని 15 మండలాల రైతులకు ఉపయోపడేలా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. విత్తనాలు, పురుగు మందులపై ఏ రైతుకైనా అనుమానం వచ్చి ఇక్కడకు తీసుకొస్తే పరీక్షించి రిపోర్టు అందిస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. నకిలీ విత్తనాలతో కొన్నిచోట్ల రైతులు నష్టపోతున్నారు. తీసుకొచ్చిన విత్తనాలను మొలక కట్టి చూసుకుంటారు. మొలక సరిగా రాకపోయినా, విత్తనాలపై అనుమానం వచ్చినా ఈ ల్యాబ్‌ల ద్వారా పరీక్షలు చేయించుకుంటే విషయం తెలిసిపోతుంది.

–రాబర్ట్ పాల్, వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

6న ఏపీయూడబ్ల్యూజే 26వ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

విజయనగరం: ఏపీయూడబ్ల్యూజే విజయనగరం జిల్లా 26వ మహాసభ వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావులు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన యూనియన్ సభ్యులంతా సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఆ సమావేశం సందర్భంగా ఇరవై ఏళ్లుగా పాత్రికేయులుగా అంకితభావంతో పనిచేస్తున్న వారిని సన్మానించనున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర పాత్రికేయుల సదస్సు కూడా ఉంటుందని జాతీయ స్థాయి పాత్రికేయ నాయకుడు, రాష్ట్ర మీడియా సంఘం సలహాదారు దేవులపల్లి అమర్ హాజరవుతారని, అలాగే రాష్ట్ర నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రానున్నారని తెలిపారు. ముఖ్యంగా యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, పాత వారిని రెన్యువల్ చేస్తామని తెలిపారు. సమావేశంలో చిన్న, మధ్యతరగతి పత్రికల యూనియన్స్ అధ్యక్షుడు కేజే శర్మ, సముద్రాల నాగరాజు, పాత్రో తదితరులు పాల్గొన్నారు.

29న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం



శత్రుచర్ల పరీక్షిత్ రాజు

పార్వతీపురంటౌన్: ఈ నెల 29న పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాలయాన్ని విద్యాశాఖ మంత్రి, మూడు జిల్లాల కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్న దొర ఉదయం 10:30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, విశ్వసరాయ కళావతి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, హాజరవుతారని, కావున నాలుగు నియోజకవర్గాల సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపాలిటీ, చైర్మన్లు, కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

లీగల్ మెట్రాలజీ మెరుపు దాడులు



తనిఖీ చేస్తున్న అధికారులు

విజయనగరం: విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల మండలాల్లో గల ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం మెరుపుదాడులు నిర్వహించారు. అధిక ధరలకు విక్రయించిన, ప్యాకెట్లపై నిర్ధారించిన బరువు కంటే తక్కువ ఉన్న వాటిని గుర్తించి దుకాణాదారు, తయారీ కంపెనీలపై కేసులు నమోదుచేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ కంట్రోలర్ మధుసూదన రెడ్డి ఆధ్వర్యంలో అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఈశ్వరరావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన వర్రి ఈశ్వరరావు (65) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈశ్వర రావు బుధవారం ఉదయం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. తెల్లవారింది మొదలు మద్యం తాగడమేనా అని భార్య నిలదీయడంతో మనస్తాపం చెంది పొలంలోకి వెళ్లి పురుగు మందుతాగాడు. ఈ విషయాన్ని పొలంలో ఉన్న ఇతర కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మృతురాలి వివరాలు లభ్యం

మండలంలోని తాటిపూడి సాగు నీటి కాలువలో బుధవారం కొట్టుకువచ్చిన వృద్ధురాలి వివరాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు ఆమెను వసాది గ్రామానికి చెందిన శీరం నారాయణమ్మగా పోలీసులు గుర్తించారు. ఆమె విజయనగరంలో తన చెల్లెలి కుమార్తె కృష్ణవేణి ఇంటి వద్ద ఉంటోంది.

180 మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన వ్యక్తి 180మద్యం సీసాలతో వెళ్తుండగా ఇద్దనవలస గ్రామం వద్ద పట్టుకున్నామని ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ గురువారం తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై రమణ పాల్గొన్నారు.

నేరం నాది కాదు సార్..!

- ఒకే బైక్‌పై 93 పెండింగ్ ఈ చలానాలు



బైక్‌ను సీజ్‌చేసి వాహనంపైకి ఎక్కిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం క్రైమ్: పెండింగ్‌లో ఉన్న పాత ఈ చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ గురువారం చేపట్టగా ఒక మోటార్ సైకిల్‌పై 93 ఈ చలానాలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించామని ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. ఆ వాహనదారు వేరే వ్యక్తి నుంచి వాహనం కొనుగోలు చేసే సమయంలో గతంలో పెండింగ్‌లో ఉన్న ఈచలానాల గురించి తనకు తెలియదని చెప్పడంతో వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పాత వాహనాలు కొనుగోలు చేసే సమయంలో రికార్డులను పరిశీలించుకోవడంతో పాటు, ఆ వాహనంపై పెండింగ్‌లో ఉన్న ఈ చలానాల గురించి కూడా తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. అలా తెలుసుకోకుంటే పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలను చెల్లించాల్సిన బాధ్యత ప్రస్తుత యజమానిపైనే ఉంటుందన్నారు. ఈ చలానాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల వాహనాలపై కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించే సమయంలో పోలీసులు చేపట్టే తనిఖీల్లో ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో పెండింగ్ ఈ చలానాలను పరిశీలించి, చలానాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టడంతో 163 మంది వాహనదారులు పాత ఈ చలానాలను చెల్లించారని డీఎస్పీ వివరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్సైలు లోవరాజు, రాజు, త్రినాథరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి మహిళా రైతు మృతి

లక్కవరపుకోట: మండలంలోని గేదులవానిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు చొప్ప రాములమ్మ(52) గ్రామానికి సమీపంలో గల కాలువలో పడి మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి సమీపంలో గల పెద్దచెరువు సమీపంలో గడ్డి మోపు తెచ్చేందుకు రాములమ్మ బుధవారం వెళ్లింది. అప్పటికే భారీ వర్షం కురవడంతో పెద్దచెరువు పడమటకాలువ వెంట నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గడ్డిమోపుతో కాలువ దాటుతున్న సమయంలో రాములమ్మ జారి పడి చెరువులోకి కొట్టుకుపోయింది. రాత్రయినా తల్లి రాకపోవడంతో కుమారుడు కన్నారావు తదితరులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. గురువారం ఉదయం చెరువులో శవమై రాములమ్మ తేలి ఉండడాన్ని స్థానికులు గమనించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


వ్యాన్ ఢీకొని యువకుడు..



సురేష్ మృతదేహం

బొబ్బిలి: పట్టణంలోని రాయగడ రోడ్డు దాటుతున్న యువకుడిని పశువుల వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామానికి చెందిన పి.సురేష్(29) అత్తవారి ఊరైన అప్పయ్యపేట గురువారం వచ్చాడు. ఈ క్రమంలో కాంప్లెక్స్ వద్ద ఓ హోటల్‌లో టిఫిన్ చేసి వస్తుండగా పార్వతీపురం నుంచి మానాపురం వెళ్తున్న పశువుల వ్యాన్ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోగా తలకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య అరుణ, పిల్లలు గిరిజ(5),రక్షిత(3) ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి..



మృతిచెందిన ఆదినారాయణ

డెంకాడ: పెదతాడివాడ ఎంపీటీసీ–2 పొంతపల్లి జగన్నాథరావు తండ్రి పొంతపల్లి ఆదినారాయణ పాము కాటుతో గురువారం మరణించారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు నాయకులు కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

పరిశ్రమలకు తక్షణ భూ కేటాయింపు

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు తక్షణమే భూమిని కేటాయించాలని ఏపీఐఐసీ అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలు, ప్రభుత్వ శాఖల ద్వారా వాటి ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులపై సమీక్షించారు. పరిశ్రమలకు అవసరమైన భూమి కేటాయింపునకు రెవెన్యూ అధికారులతో పరిశ్రమల శాఖ అధికారులు స్వయంగా మాట్లాడాలన్నారు. క్లస్టర్ అభివృద్ధి పథకంలో పరిశ్రమల ఏర్పాటుకోసం భూముల గుర్తింపు త్వరగా పూర్తిచేయాలన్నారు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భద్రత చర్యలు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా పీఎంఈజీపీ పథకంలో ప్రభుత్వం కేటాయించిన మేరకు యూనిట్లు ఏర్పాటు కావాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకోసం సింగిల్ డెస్క్ విధానంలో ఈ ఏడాది మే 25 నుంచి 26 జూలై వరకు 125 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 108 దరఖాస్తులకు అన్నిరకాల అనుమతులు మంజూరు చేసినట్లు జిల్లా పరిశ్రమల అధికారి పాపారావు వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి వద్ద 16 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక దరఖాస్తును పీసీబీ తిరస్కరించిందన్నారు. జిల్లాలోని ఏపీఐఐసీ ఆధ్వర్యంలోని పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకోసం అందుబాటులో ఉన్న భూముల పరిస్థితిని ఆ సంస్థ జోనల్ మేనేజర్ యతిరాజులు తెలియజేశారు. సమావేశంలో ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, ఏపీఐఐసీ డైరెక్టర్ బంగారు నాయుడు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

సంగాంలో ఏనుగుల సంచారం

వంగర: మండల పరిధి సంగాంలో ఏనుగులు గుంపు తిష్ఠవేసింది. రెండు రోజుల కిందట సంగాం గ్రామ పంటపొలాల్లోకి ప్రవేశించాయి. చెరకు, వరి, మొక్క జొన్న పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికే గ్రామంలోని ముసురుగుడ్డి, బారిక గుడ్డి, పెద్దగుడ్డి, రెల్లిగుడ్డి, ఎర్రగుడ్డి, మెరకపట్టి, బందమడులు, వంకాయలు కర్ర పొలాల్లో పంటలను నాశనం చేశాయి. మగ్గూరు, బాగెంపేట, శ్రీహరిపురం గ్రామాల రైతులకు చెందిన పంటలను కూడా ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగుల సంచారంపై అటవీ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులను కవ్వించవద్దని హెచ్చరిస్తున్నారు. పంటలు నష్టం వాటిల్లిన రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు గేదెల వెంకటనాయుడు, పోలిరెడ్డి రమేష్, రెడ్డి సత్యవతి కోరారు.